**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760
ధర్మవరం, పుట్టపర్తి : 9963160529
కదిరి :9052518170
ఏసీఎం: 9985411154


నల్లగుట్టపల్లి వద్ద పొలంలోనే వదిలేసిన టమోటా


కొనేవారులేక ఇంటిలోనే నిల్వచేసిన వేరుశనగ

# రాబడి లేని రబీ

**సాగుచేసిన పంటలన్నీ నష్టాలే**
**దిగుబడి ఉంటే ధరలు లేవు**
**ధరలు ఉంటే దిగుబడి లేదు**
**కరువు ప్రకటించినా అందని పరిహారం**



"చీడ పీడలు, వర్షాభావంతో ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు.. రబీలోనూ కన్నీళ్లే మిగిలాయి. ఈ సీజన్‌లో సాగుచేసిన పంటలన్నీ నట్టేట ముంచాయి. వేరుశనగకు అంతో ఇంతో దిగుబడి వస్తే ధర పూర్తిగా పతనమైపోయింది. టమోటా, కర్బూజ, దోస పంటలు దిగుబడి వచ్చినా ధర లేక పొలాల్లోనే వదిలేయాల్సిన దుస్థితి. మామిడికి మార్కెట్‌లో ప్రస్తుతం ధరలు బాగా ఉన్నాయి. పూత దశలో మురిపించిన పంట పిందె కాయకుండానే రాలిపోయింది. ఉన్న కాస్త పంట కూడా అకాల వర్షాలతో కొట్టుకుపోయింది. ఇదీ నంబులపూలకుంట మండల రైతు దీన గాథ. కరువు మండలంగా ప్రకటించినా ఇసుమంతైనా ప్రయోజనం లేకుండా పోయింది."

నంబులపూలకుంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసిన పంటలన్నీ నష్టాలే మిగిల్చాయి. చాలా వరకు పెట్టుబడులు కూడా చేతికందక రైతులు అప్పులపాలయ్యారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి పావలా వడ్డీ జమ కాదు. గత ఏడాది చేసుకున్న తేదీ కన్నా ఒకరోజు ముందుగా రెన్యువల్ చేసుకుంటే తప్ప పావలా వడ్డీకి అర్హత ఉండదు. రెన్యువల్ చేసుకోవడానికి రైతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలకు ధరలు లేక రైతులు అప్పులపాలయ్యారు. కొన్ని పంటలు దెబ్బతినడంతో పొలాల్లోనే వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణాల నుంచి మైక్రో ఫైనాన్స్ సంస్థలు అప్పులు ఇస్తామంటూ ముందుకు వస్తున్నాయి. గ్రామాల్లో అప్పులిచ్చేవారు లేకపోవడంతో నమ్ముకున్న ఇంటిని ఫైనాన్స్ వారి చేతిలో పెడితే తప్ప అప్పులు పుట్టడంలేదు. అప్పుల వారి బాధ తాళలేక ఇంటిని సైతం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తాకట్టు పెడుతున్నారు. మరికొందరు రైతులు భూమిని అమ్మితే జీవనం కష్టమవుతుందని ఉన్న ఇంటిని అమ్మి పొలంలోనే గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. రబీలో మండల వ్యాప్తంగా సాగుచేసిన పంటలకు పెట్టుబడులు కూడా రాలేదు. మండలంలో వేరుశనగ 2,477 ఎకరాలు, టమోటా 169, కర్బూజ 42, మామిడి 805, చీనీ 132, దోస 50 ఎకరాల్లో సాగుచేశారు. టమోటా రైతుల పరిస్థితి మరీ దయనీయం. మార్కెట్‌కు తరలించిన రవాణా ఖర్చులు, కూలి డబ్బులు కూడా రాకపోవడంతో అలాగే వదిలేయాల్సిన పరిస్థితులు దాపురించాయి.



## కరువు ప్రకటించినా అందని పరిహారం

2023 సంవత్సరంలో తీవ్ర కరువు మండలంగా ప్రకటించారు. 2024 ఖరీఫ్‌లో మధ్యంతర కరువుగా ప్రకటించారు. కానీ రైతులకు ఎలాంటి ప్రయోజనాలూ చేకూరలేరలేదు. ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరై ఉంటే ఎంతో ఉపశమనం కలిగేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో 3,695 మంది రైతులు 3073.19 ఎకరాల్లో పంట నష్టపోయారని, అందుకుగాను రూ.4,74,55,420 రైతులకు చెల్లించాలని వ్యవసాయ అధికారులు నివేదికలు పంపారు. 2023-24లో పంటల బీమా కూడా వర్తించలేదు.


నంబులపూలకుంట వద్ద సాగుచేసిన వంకాయ పంట

## దోబూచులాడుతున్న ధరలు

ఈ ఏడాది మామిడి దిగుబడి లేకపోవడంతో మార్కెట్‌లో ధరలు అధికంగా పలుకుతున్నాయి. పూత దశలోనే మామిడి పూర్తిగా దెబ్బతినింది. టమాట, కర్బూజ, దోస పంటలు దిగుబడి బాగా వచ్చాయి. టమోటాకు ధరలు లేకపోవడంతో పొల్లాలోనే వదిలేశారు. కర్బూజ, దోస పంటలది కూడా అదే పరిస్థితి. కూరగాయలకు ధరలు ఉంటాయనుకుంటే అవికూడా పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వేరుశనగ సాగుచేసిన రైతులు మరింత అప్పులపాలయ్యారు. ఖరీఫ్‌లో చీడపీడలు సోకడంతో ఖర్చులు అధికమై దిగుబడి తగ్గడంతో నష్టాలు బాట పట్టారు. రబీలో సాగుచేసిన వశిష్ట, కె -124 వేరుశనగ రకాలు బాగా దిగుబడినిచ్చాయి. వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇళ్లలోనే నిల్వచేసుకున్నారు. కె-6, 1694 రకాలను మాత్రమే వ్యాపారులు కొనుగోలుచేస్తున్నారు. వీటిలో నూనె శాతం అధికంగా ఉంటుందని, మిల్లులకు తరలిస్తున్నారు. 44 కిలోల బస్తా రూ.2,800కు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ధరలు లేవని ఇళ్లలో ఉంచుకోలేక, అప్పుల వారికి సమాధానం చెప్పుకోలేక వ్యాపారులను ప్రాధేయపడి అయినకాడికి అమ్మివేస్తున్నారు.

### ఇంటిని అమ్మేసి పొలంలో ఉంటున్నా



పది ఎకరాలు గుత్తకు తీసుకుని వేరుశనగ సాగుచేశా. 720 శేర్లు విత్తనాలు వేశా. 150 బస్తాల దిగుబడి వచ్చింది. రూ.8లక్షకు పైగా పెట్టుబడులు వచ్చాయి. పెట్టుబడులు పోనూ రూ. 2 లక్షలు నష్టం మిగిలింది. మా కుటుం చేసిన కష్టం కూడా మిగలలేదు. అప్పులవారికి సమాధానం చెప్పుకోలేక, ఉన్న ఇంటిని సైతం అప్పులవారికి తాకట్టు పెట్టాల్సి వస్తోంది. అప్పులవారికి జమకట్టడానికి ఉన్న ఇంటిని అమ్మేసి, పొలం లో షెడ్ వేసుకుని జీవనం సాగిస్తున్నాం.

- హుస్సేన్‌సాబ్,
రైతు, నంబులపూలకుంట

### టమోటా సాగుచేసి నష్టపోయా



గుత్తకు తీసుకుని రెండు ఎకరాల్లో టమోటా సాగుచేశా. రూ.2 లక్షలు ఖర్చు అయింది. సొంతగా టమోటా అమ్ముకుంటే రూ.50వేలు చేతికొచ్చింది. చేతికష్టంపోనూ, పెట్టుబడికూడా నష్టం వచ్చింది. ఫర్టిలైజర్ దుకాణదారులకు అప్పులు చెల్లించాల్సి ఉంది. కూలీలకు కూడా చాలామందికి డబ్బులు ఇవ్వాల్సి ఉంది. మార్కెట్‌కు టమోటాలు తీసుకెళితే కూలి డబ్బులు కూడా చేతికిరాలేదు. ఈ యేడాపూర్తిగా నష్టపోయాను.

- శ్రీనివాసులు,
రైతు, దిగువపల్లి

# మెరుగైన రవాణా సౌకర్యాలే లక్ష్యం

**రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి**


ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ తదితరులు, నూతన బస్సుసర్వీసులు ప్రారంభిస్తూ..

మడకశిర టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అమరాపురం బస్టాండ్ ఆవరణలో రాయచోటి, అనంతపురం వెళ్ల కొత్త సర్వీసులను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆర్టీసీ తీవ్రంగా నష్టపోయిందన్నారు. అయితే ముఖ్య మంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించాక అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నారన్నారు. రోడ్డు సౌకర్యం ఉన్న ప్రతి గ్రామానికి ఆర్టీసీ సర్వీసును నడపడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. మడకశిర ఆర్టీసీ డిపోను అన్ని విధాల అభివృద్ధి చేయడానికి సహకారం అందిస్తామన్నారు.


### ఇండోర్ స్టేడియం ప్రారంభించిన మంత్రి

పట్టణంలోని ఇండోర్ స్టేడియాన్ని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్యారం బోర్డు, బ్యాడ్మింటన్ ఆడారు. క్రీడాకారులు ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందజేస్తుందన్నారు. గ్రామీణ క్రీడా కారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గత టీడీపీ పాలనలో మంజూరై నిర్మాణం చేపట్టిన స్థానిక ఇండోర్ స్టేడియాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. మళ్లీ తామే దాన్ని పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు.

### అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

మడకశిర పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో ఎమ్మెల్యే బాబు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు మంత్రి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కార్యనిర్వహక కార్యదర్శి రాధాకృష్ణ, నియోజకవర్గంలో ఐదు మండలాల కన్వీనర్లు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## డీఐఈఓగా సయ్యద్‌మౌలా


బాధ్యతలు చేపడుతున్న డీఐఈఓ సయ్యద్‌మౌలా

కొత్తచెరువు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ జిల్లా విద్యాశాఖ అధికారిగా సయ్యద్ మౌలా శనివారం స్థానిక డీఐఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఐఈఓగా పని చేస్తున్న రఘునాథరెడ్డి అనంతపుర న్యూటౌన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు. చిత్తూరు జిల్లా నుంచి ఉద్యోగోన్నతిపై సయ్యద్‌మౌలా సత్యసాయి జిల్లా డీఐఈఓగా వచ్చారు. ఆయనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షురాలు శ్రీదేవి, జిల్లా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం సభ్యులు రామకృష్ణారెడ్డి, నాగభూషణం, రమేశ్‌రెడ్డి, సుశీల ఆయనకు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్లత, అధ్యాపకుడు సుమన్‌లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ఐదిళ్లలో చోరీ**
రూ.5వేలు తస్కరించిన దొంగలు...
లాకర్లలో పెట్టడంతో బంగారం సేఫ్

**పకడ్బందీగా పాలిసెట్ నిర్వహించాలి : డీఆర్వో**

వైసీపీ పాలనలో
**వ్యవస్థలన్నీ నాశనం**
రవాణా, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

7

# ఎన్నాళ్లీ ఎదురుచూపులు..?



రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం నిరీక్షణ
కనీస ప్రకటన లేకపోవడంతో నిరాశ
ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్న అర్హులు

ధర్మవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు, పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడాదికావస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస ప్రకటన కూడా లేకపోవడంతో వారంతా నిరాశ చెందుతున్నారు. ఎమ్మెల్యేలు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో కూడా వీటిపైనే అత్యధిక మంది దరఖాస్తులు అందజేస్తున్నారు. అలాగే రేషన్ కార్డు బైఫర్‌గేషన్ కోసం చాలా మంది ఎదురు చూస్తున్నారు. వీటిపై ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు నిలదీస్తుంటే ఏమి సమాధానం చెప్పాలో తెలియక పలువురు ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. రేషన్ కార్డు, పింఛన్‌ల మంజూరుపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

### రాజకీయ కక్షతో తొలగింపు

వైసీపీ పాలనలో టీడీపీ సానుభూతిపరులుగా ముద్రవేసి పింఛన్లు, రేషన్‌కార్డులను పెద్దసంఖ్యలో తొలగించారు. వైసీపీ నేత సిఫార్సులతో అనర్హులకు రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేశారు. నకిలీ మెడికల్ సర్టిఫికెట్‌లు సృష్టించి దివ్యాంగుల కోటాలో వందలాది మంది అనర్హులు పింఛన్లను తీసుకుంటున్నారు. ఆయా పింఛన్లపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విచారణ నత్తనడకన సాగుతోంది. అనర్హులను తొలగించి అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నా మా మొర ఆలకించే వారే కరువయ్యారని పలువురు వాపోతున్నారు.

### రేషన్‌కార్డుతోనే పథకాల లబ్ధి

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలకు రేషన్‌కార్డు ఆదాయ ధ్రువీకరణపత్రంగా ఉపకరిస్తుంది. ఎన్టీఆర్ వైద్య సేవ కార్డు ఉండాలన్నా ప్రైవేటు ఆస్పత్రుల లో ఉచితంగా వైద్య సేవలు పొందాలన్నా రేషన్ కార్డు తప్పనిసరి, పింఛన్ మంజూరుకు కూడా రేషన్‌కార్డు ఉండాల్సిందే. దీంతో జిల్లాలో వేలాది మంది రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. రేషన్‌కార్డు లేనివారు, సాంకేతిక కారణాలతో కార్డు పొందలేనివారు తమకు తాజాగా మంజూరు చేయాలని అధికారులను కోరుతున్నారు. రేషన్ కార్డులో పిల్లల పేర్లను చేర్చడానికి కూడా అనేకమంది ఆప్షన్ కోసం ఎదురు చూస్తున్నారు.



### చెయ్యి పోయినా పింఛన్ రాలేదు

రెండేళ్ల కిందట గడ్డి కోత యంత్రంలో పడటంతో నేను చెయ్యి పోగొట్టుకున్నా. దివ్యాంగ సర్టిఫికెట్ కూడా ఉంది. పింఛన్‌కు దరఖాస్తు చేయడానికి సచివాలయం చుట్టు తిరుగుతున్నా. అయితే సిబ్బంది ఇంకా సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి నాకు దివ్యాంగ పింఛన్ వచ్చేలా చూడాలి.

- మంగళరత్నమ్మ, కొత్తచెరువు

### ఏడాదిగా ఎదురుచూస్తున్నా



రేషన్‌కార్డు కోసం ఏడాది నుంచి ఎదురు చూస్తున్నా. నాకు వివాహమై ఏడాది కావస్తోంది. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుని సచివాలయం చుట్టు తిరుగుతున్నా. అయితే సచివాలయ సిబ్బంది సైట్ ఓపెన్‌కాలేదు అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

- సౌందర్య, టీచర్స్ కాలనీ, ధర్మవరం

### ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

పింఛన్ల దరఖాస్తు కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అంతేకాకుండా వెబ్‌సైట్ కూడా ఓపెన్‌కాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పింఛన్ల దరఖాస్తులు స్వీకరిస్తాం. అనంతరం వాటిని పరిశీలించి కొత్త పింఛన్లను పంపిణీ చేస్తాం.

- నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

# పిల్ల చేష్టలు..!

**ద్విచక్రవాహన విన్యాసాలతో ఇతరుల బెంబేలు**


ప్రమాదకరంగా వీలింగ్ చేస్తున్న మైనర్లు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సినిమాల్లో చూపించినట్లుగా ఓ చక్రాన్ని పైకి లేపి ద్విచక్రవాహనాన్ని నడుపుతుంటే గాల్లో తేలినట్లే ఉంటుంది. కానీ ప్రమాదం జరిగితే ప్రాణాలు గాల్లో కలిసిపోవడం ఖాయం. జీవితం విలువ తెలియని మైనర్లు కొందరు పట్టణ రోడ్లపై బైక్‌లతో విన్యాసాలు చేస్తూ హీరోల్లా ఫోజులు కొడుతున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శనివారం ఇద్దరు మైనర్లు ద్విచక్రవాహనంపై కూర్చుని ముందు చక్రం పైకి లేపి విన్యాసాలు చేస్తూ వెళ్లారు. ఈ క్రమంలో అటువెళ్లే వాహనదారులు తమపై దూసుకొస్తారేమోనని ఆందోళన చెందారు. పొరపాటున వాహనం కింద పడితే హెల్మెట్ కూడా ధరించని వారి తలలు తారు రోడ్డుపై పుచ్చకాయల్లా పగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రమాదం వారికే కాక అటు వైపు వెళ్లే వాహనదారులు, పాదచారులకు కూడా జరిగే అవకాశం ఉంది. ఈ పిల్ల చేష్టలను వారి తల్లిదండ్రులు పట్టించుకోరు, పోలీసులు నియంత్రించరు అన్నట్లుగా పట్టణంలో పరిస్థితి ఉంది. వేసవి సెలవులు కావడంతో విచ్చలవిడిగా మైనర్లు పట్టణంలో వాహనాలు నడుపుతున్నారు.

7

# పుట్టపర్తిలో విస్తృత తనిఖీలు


ప్రశాంతి నిలయంలోని భక్తనివాస్ వద్ద భద్రతా ఏర్పాట్ల గురించి డీఎస్పీలతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

# పుట్టపర్తిలో విస్తృత తనిఖీలు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో శనివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ రత్న ఆధ్వర్యంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, ఆదినారాయణ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.



పురంలో వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐలు

సాయంత్రం ప్రశాంతినిలయంలోని శాంతిభవన్, పడమటిగేట్, యాత్రికుల నివాసాలు, షాపింగ్ సెంటర్, సాయికుల్వంత్ సభా మండపం, గణేష్‌గేట్, ప్రశాంతినిలయంలోని ముఖ్యమైన ప్రదేశాల పరిసరాలలో భద్రతాపరమైన ఏర్పాట్లను పరివేక్షించారు. ప్రశాంతి నిలయంలోని పలుప్రదేశాలను డాగ్‌స్క్వాడ్, బీబీ టీంలు తనిఖీలు నిర్వహించాయి. ఎస్పీ రత్న మాట్లాడుతూ దేశ, విదేశ పౌరుల భద్రతా పరమైన చర్యల్లో భాగంగానే తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని హోటళుల, లాడ్జీలు, మామిళ్ల కుంట కూడలిలోని ప్రశాంతినిలయం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ఆయా సబ్‌డివిజన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మామిళ్లకుంట కూడలిలో ఎస్పీ వాహన తనిఖీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు సునీత, సురేష్‌కుమార్, ఎస్బీ ఎస్సై ప్రదీప్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మహేష్, వలి, ఆర్ఎస్సై ప్రదీప్‌సింగ్, స్పెషల్‌పార్టీ పోలీసు సిబ్బంది, మహిళాపోలీసులు తనిఖీల్లో పాల్గొన్నారు.

## పురంలో 11మంది విదేశీయుల గుర్తింపు

హిందూపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం సాయంత్రం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ


ప్రశాంతినిలయం సెక్యూరిటీ వింగ్ పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

తనిఖీల్లో 11మంది విదేశీయులను గుర్తించారు. డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, జనార్దన్, అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో పట్టణాన్ని జల్లెడ పట్టారు. గుడ్డం ప్రాంతంలో కార్డెన్ సర్చ్ నిర్వహించగా ఓ పాత నేరస్థుడు పట్టుబడ్డాడు. సాయంత్రం లాడ్జీలు, జన సమ్మర్ధ ప్రాంతాలు, ప్రార్ధనా మందిరాల్లో తనిఖీలు చేయగా ఖజకిస్థాన్‌కు చెందిన ఒకరు, కిర్గిస్థాన్ 9, ఉక్రెయిన్‌కు చెందిన ఒకరు హిందూపురంలో ఉన్నట్లు గుర్తించారు. ఈ 11మంది జమాత్ కోసం వచ్చినట్లు ఆధారాలు ఉండటంతో పోలీసులు వదిలేశారు. అదేవిధంగా వాహనాలు తనిఖీ చేసి, రికార్డులేని వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం


హ్యాండ్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

కదిరిఅర్బన్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 54వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభించినట్లు ఆర్గనైజర్ రామాంజనేయులు తెలిపారు. మొదటి రోజు లీగ్ మ్యాచ్‌లో గుంటూరు జట్టుపై అనంతపురం జట్టు, శ్రీకాకుళం జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించాయన్నారు. కడపజట్టుపై తూర్పుగోదావరి జట్టు, నంద్యాల జట్టుపై చిత్తూరు, ప్రకాశం జట్టుపై పశ్చిమగోదావరి, నంద్యాల జట్టుపై విజయనగరం, బాపట్ల జట్టుపై కర్నూలు జట్టు గెలుపొందాయన్నారు. ఈపోటీలను జోన్ డీఎస్పీ శివకుమార్, కదిరి మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, టీడీపీ సీనియర్‌నాయకుడు బంగారు క్రిష్ణమూర్తి ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో పీడీ నరసింహచారి, జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్, కార్యదర్శి మహేష్ తదితరులున్నారు.



# ఇంకానా..!

## టిడ్కో గృహాల కోసం తప్పని ఎదురుచూపులు

| పట్టణం | మంజూరైన గృహాలు | నిర్మాణం చేపట్టినవి.. |
|---|---|---|
| తాడిపత్రి | 6,529 | 5,184 |
| ధర్మవరం | 8,832 | 1,440 |
| గుత్తి | 39896 | |
| హిందూపురం | 2,750 | 1,200 |
| కదిరి | 3,762 | 1,104 |
| పామిడి | 2,599 | 1,344 |
| పుట్టపర్తి | 1,243 | 432 |
| అనంతపురం | 6,117 | 2,304 |
| గుంతకల్లు | 4,719 | 2,160 |
| రాయదుర్గం | 1,791 | 1,008 |
| మొత్తం | 38,740 | 16,272 |

**ఇళ్లు కేటాయించకనే ఈఎంఐల బెడద**

**ఆందోళనలో లబ్ధిదారులు**

**ఇళ్ల పూర్తికి రూ.382 కోట్లతో ప్రతిపాదనలు**

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏపీ టిడ్కో గృహాల కోసం లబ్ధిదారులకు నేటికీ ఎదురుచూపులు తప్పలేదు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంత పేదలకు టిడ్కో గృహాలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 38,740 ఇళ్లను మంజూరు చేసింది. 16272 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించింది. చాలావరకు పూర్తి చేసింది కూడా. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లపాటు టిడ్కో గృహాలను గాలికొదిలేసింది. దీంతో అవి అసాంఘిక కార్యకలాపాలు, విషపురుగులకు ఆవాసాలుగా మారిపోయాయి. గతేడాది కొలువు దీరిన కొత్త ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించి గృహప్రవేశాలు కూడా చేపడతామని పేర్కొంది. దీంతో టిడ్కో ఇంజనీర్లు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.382 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. తమకు ఇళ్లు కేటాయించకనే ఈఎంఐలు కట్టాలని బ్యాంకులు నోటీసులు పంపడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం త్వరగా టిడ్కో గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి, లబ్ధిదారులకు అందజేయాలని ఆశిస్తున్నారు.


అనంతపురంలో టిడ్కో గృహాలు



అనంతపురంలోని ఏపీ టిడ్కో కార్యాలయం

### నిర్వీర్యం చేసిన వైసీపీ

గత టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంత పేదలకు అపార్టుమెంట్ల తరహాలో టిడ్కో గృహాలు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాకు 38,740 టిడ్కో గృహాలను మంజూరు చేసింది. వాటిలో 16,272 ఇళ్ల నిర్మాణం చేపట్టింది. పనులు చివరి దరకు చేరాయి. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ టిడ్కో ఇళ్లను పూర్తిగా అటకెక్కించింది. దీంతో అసాంఘిక కార్యకలాపాలు, విషపురుగులకు అవాసాలుగా టిడ్కో గృహాలు మారిపోయాయి. ఐదేళ్లూ లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పలేదు. టిడ్కో ఇంజనీర్లు చివరి నిర్మాణదశలో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి గత వైసీపీ పభుత్వంలో పలుమార్లు ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు.


పుట్టపర్తిలోని కర్ణాటక నాగేపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల సముదాయం

### రూ.382.92 కోట్లు అవసరం

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణానికి రూ.382.92 కోట్ల నిధులు అవసరం. అనంతపురం జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి రూ.198 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.55.27 కోట్లు, మురుగు నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు రూ.5.79కోట్లు, తాడిపత్రిలో మహిళా మార్టుకు రూ.1.63 కోట్లు మొత్తంగా రూ.260.78 కోట్ల నిధులు అవసరం ఉందని టిడ్కో ఇంజనీర్లు.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పూర్తికి రూ.86.68 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.32 కోట్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు రూ.3.46 కోట్లు మొత్తంగా రూ.122.14 కోట్ల నిధుల అవసరం అని ప్రతిపాదనలు అందజేశారు.

టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి, ఇంజనీర్లు(ఫైల్)



### బ్యాంకుల నుంచి నోటీసులు

టిడ్కో ఇళ్లను మూడు కేటగిరీలుగా విభజించారు. 300 చదరపు అడుగుల ఇంటికి లబ్ధిదారుడు రూపాయి మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో కేంద్రం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5.04 లక్షల వాటాతో మొత్తంగా యూనిట్ రూ.6.55 లక్షలుగా నిర్ణయించారు. 365 చదరపు అడుగుల ఇంటికి లబ్ధిదారుడి వాటా రూ.3.40 లక్షలు, కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.65 లక్షలు, బ్యాంకు రుణం రూ.3.15 లక్షలు, మొత్తంగా యూనిట్ రూ.7.55 లక్షలుగా నిర్ణయించారు. 430 చదరపు అడుగుల ఇంటికి కేంద్రం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.90 లక్షలు, బ్యాంకు లోను రూ.3.65 లక్షలు, లబ్ధిదారుడి వాటా రూ.4.15 లక్షలు కలిపి యూనిట్ ధర రూ.8.55 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది.

### ఈఎంఐ కట్టాలని నోటీసులు వచ్చాయి

2018లో రూ.25వేలు టిడ్కో ఇంటి కోసం కట్టాం. ఇంత వరకు ఇల్లు కేటాయించలేదు. అయినా ఈఎంఐ కట్టాలని బ్యాంకు నుంచి నోటీసులు వచ్చాయి. ఇదే విషయంపై అనేకమార్లు మున్సిపాలిటీ, టిడ్కో అధికారులను కలిసి విన్నవించా. అయినా పట్టించుకోవడం లేదు. ఇల్లే లేకుండా ఈఎంఐ ఎలా చెల్లించాలి? ఐదేళ్లపాటు అందరి చుట్టూ తిరిగినా సమస్య పరిష్కరించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టిడ్కో ఇళ్లపై నిర్ణయం తీసుకోవాలి.

**- నాగేంద్రప్రసాద్, టిడ్కో లబ్ధిదారుడు, అనంతపురం**

### నిధులు రాగానే పనులు చేపడతాం



టిడ్కో గృహ సముదాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రాగానే టిడ్కో గృహాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

**- సుధారాణి, టిడ్కో ఈఈ, ఉమ్మడి జిల్లా**

## ముస్లిం పథకాలకు మోక్షం కలిగేనా..?

- వైసీపీ హయాంలో అటకెక్కిన ముస్లింల పథకాలు
- ప్రస్తుత ప్రభుత్వంపై ఆశలు




ధర్మవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ముస్లిం కోసం ప్రవేశ పెట్టిన పథకాలను వైసీపీ హయాంలో జగన్‌రెడ్డి అటకెక్కించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 2014-19 హయాంలో మసీదులలో ఇమాంలకు రూ.10 వేలు, మౌజాన్‌లకు రూ.5వేలు ప్రతి నెలా గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు వారి అభివృద్ధికి పెద్దపీట వేశారు. జగన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు పాదయాత్ర చేస్తూ.. ముస్లింలకు ఎన్నో హామీలు గుప్పించారు. ఇస్లామిక్ బ్యాంక్, దుల్హన్ రూ.50వేల నుంచి రూ.లక్ష ఇస్తానని, ఇమామ్‌లకు రూ.10వేలు, మసీదు, ఈద్గాల మరమ్మతులకు రూ.25వేలు, విదేశీవిద్య తదితర హామీలిచ్చారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఏ ఒక్క హామీ అమలు చేయకపోగా ఉన్న వాటిని రద్దు చేశారని ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంజాన్ తోఫా రద్దు చేశారని, జీవనోపాధికి 50 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తుంటే వాటిని కూడా నిలిపివేశారని తెలిపారు. ఉర్దూ అకాడమీని అస్తవ్యస్తంగా తయారు చేశారు. కూటమి ఎన్నికల ముందు గత పథకాలు అమలు చేస్తామని హామీలిచ్చింది. ఈ క్రమంలో దుల్హన్ పథకం, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. అవి ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. మిగిలిన పథకాలను తక్షణమే అమలు చేయాలని ముస్లింలు కోరుతున్నారు.

### దుల్హాన్ పథకాన్ని అమలు చేయాలి



తెలుగుదేశం ప్రభుత్వం 2014-19లో ముస్లింలకు అనేక పథకాలు ప్రవేశ పెట్టింది. ముఖ్యంగా పేద ముస్లింలకు దుల్హన్ పథకం ఓ వరం. ప్రతి ముస్లిం రంజాన్ పండుగను సంతోషంగా చేసుకోవాలని.. తోఫా ద్వారా సరుకులను అందించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ అందిస్తున్న పథకాలన్నీ రద్దుచేసింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈద్గా, మసీదుల ఊసే పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా గత పథకాలను అమలు చేస్తారని ఆశిస్తున్నాం. **- బాబావలి, ధర్మవరం**

### కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలి



ఐదేళ్ల జగన్ పాలనలో రుణాలే ఇవ్వలేదు. టీడీపీ హయాంలో ముస్లింలకు అందిస్తున్న పథకాలన్నీ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం గత పథకాలన్నీ అమలు చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలి. రంజాన్ తోఫా, విదేశీ విద్య తప్పని సరిగా అందించాలి.

**- ఫకృద్దీన్, ధర్మవరం**

# వేటగాళ్లు..!

**మొద్దుల లోడు కనిపిస్తే చాలు వేటే..**

**బేరం కుదిరితే సరి.. లేదంటే చుక్కలే**

**తమ పరిధి కాకున్నా.. సామిల్లుల్లో హల్ చల్**

**అటవీశాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాలు**



అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మొద్దుల లోడు కనిపిస్తే చాలు అటవీశాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది తమ పరిధి దాటి వేటాడుతున్నారు. ఇది విధుల్లో భాగంగానా అంటే ఎంత మాత్రం కాదు. 'బేరం' కుదరగానే వదిలేస్తారు. లోడు తరలించేవారు రూల్స్ మాట్లాడితే మాత్రం వారికి పగలే చుక్కలు చూపిస్తారు. ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో క్షేత్ర స్థాయి సిబ్బంది అక్రమాలకు అడ్డు లేకుండా పోతోందనే ప్రచారం జరుగుతోంది. ఈ రెండు ఉదాహరణలను పరిశీలిస్తే క్షేత్రస్థాయి సిబ్బంది ఎంతలా బరితెగిస్తున్నారో అర్థం అవుతుంది.



- సొంత భూముల్లో పెంచుకొన్న వేపచెట్లను కోసి ట్రాన్స్‌పోర్ట్ చేస్తుండగా రెండు వాహనాలను గత గురువారం పట్టుకున్నారు. ఇందులో ఒక వాహనం గార్లదిన్నె మండలం నుంచి, మరో వాహనం ఉరవకొండ మండలం వైపు నుంచి వచ్చినట్లు తెలిసింది. అయితే ఈ వాహనాలను పట్టుకుంది మాత్రం శింగనమలకు చెందిన బీట్ ఆఫీసర్. అది కూడా అనంతపురం నగరంలోని ఓ సామిల్లులో. శింగనమలకు చెందిన బీట్ ఆఫీసర్‌కు అనంతపురం సామిల్లులో ఉన్న వాహనాలను పట్టుకొనే అధికారం ఎవరిచ్చారన్నదే ఇక్కడ ప్రశ్న. గార్లదిన్నె మండలం నుంచి వచ్చిన మొద్దులకు సంబంధించిన యజమానులు రూ.10 వేలు ముట్టచెప్పడంతో ఎలాంటి రసీదు లేకుండానే చేతి ఖర్చుల కింద పెట్టుకొని వదిలేసినట్లు తెలిసింది. సొంత పొలాల్లో పెంచుకున్న చెట్లు కొట్టుకోవడానికి రూ.500 చెల్లించి అనుమతి తీసుకుంటే సరిపోతుంది. అలా చేయకపోవడమే అవినీతి అధికారులకు కలిసి వస్తోంది.
- ఉరవకొండ మండలం వైపు నుంచి వచ్చిన వాహనంలో మొద్దులు ఎక్కువ ఉండటంతో మామూళ్లు కూడా ఎక్కువ ఆశించినట్లు సమాచారం. యజమానులు రూ.ఐదు వేలు ఇవ్వడానికి ప్రయత్నిస్తే తిరస్కరించినట్లు తెలిసింది. వాహన డ్రైవర్ మాత్రం తనకెందుకు తలనొప్పి అని యజమాని చెప్పిన గుత్తిరోడ్డులోని ఓ సామిల్లులో మొద్దులు వదిలేసి వెళ్లిపోయాడు. ఇక చేసేది ఏమి లేక క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నతాధికారులతో చర్చించారు. టన్ను రూ.17 వేల ప్రకారం నాలుగు టన్నులకు అపరాధ రుసుం చెల్లించాలని హుకుం జారీ చేశారు. అయితే అక్కడ ఉన్న మొద్దులు అంత విలువ చేయవు. చూసి తగిన న్యాయం చేయాలని వేడుకున్నట్లు తెలిసింది. అయితే అప్పటికే క్షేత్రస్థాయి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఉన్నతాధికారి మొద్దుల యజమానులపై దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. అధికారి తీరుకు నిరసనగా మొద్దుల యజమాని తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన తెలిపి, ఇక్కడ జరుగుతున్న అక్రమాలను శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు శుక్రవారం ఉదయం కార్యాలయానికి వచ్చాడు. సదరు బీట్ ఆఫీసర్‌గాని, సంబంధిత అధికారి గాని అందుబాటులో లేరు. అయితే ఇక్కడ చోటు చేసుకున్న తంతు వారిద్దరి దృష్టికి వెల్లింది. దీంతో ఈ సమస్య తమకు ముప్పుగా మారే అవకాశం ఉందని గ్రహించి, ఒక టన్నుకు మాత్రమే ప్రకారం అపరాధ రుసుం కట్టించుకుని వదిలేశారు. అయితే 4 టన్నులకు కట్టించాలని అనుకున్న అధికారులు ఒక టన్నుకే ఎందుకు కట్టించారన్నదే ఇక్కడ ప్రశ్న. డీఎఫ్ఓ విఘ్నేష్, సీఎఫ్ యశోదబాయి స్పందించి క్షేత్ర స్థాయి సిబ్బంది ఆగడాలు అరికట్టాల్సి ఉంది.



అటవీశాఖ జిల్లా కార్యాలయం (ఫైల్)

## ఎడారి నివారణకు ప్రణాళికలు రూపొందించండి

**ద్వామా రాష్ట్ర బృందానికి ప్రభుత్వ విప్ కాలవ సూచన**

**బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో రాష్ట్ర బృందం పర్యటన**

అనంతపురం/క్లాక్‌టవర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గంలో ఎడారి నివారణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ద్వామా రాష్ట్ర పరిశీలకుల బృందానికి సూచించారు. ఈ మేరకు శనివారం ద్వామా కార్యాలయంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ద్వామా రాష్ట్ర పరిశీలకుల బృందం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు రాష్ట్ర బృందానికి పలు సూచనలు చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలో బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఏడాదికేడాది ఇసుక దిబ్బలు విస్తరిస్తున్న నేపథ్యంలో నివారణచర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేమకల్లు పర్యటనకు వచ్చిన సందర్భంలో ఈ సమస్యను ఆయన దృష్టికి తెచ్చామన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో ప్రభుత్వం ఓ ప్రత్యేక పరిశీలన బృందాన్ని రాజస్థాన్‌కు పంపి అధ్యయనం చేయించిందన్నారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎడారి నివారణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆయన ఆ బృందం సభ్యులను కోరారు. ద్వామా రాష్ట్ర పరిశీలకుల బృందం బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల పరిధిలోని నాగేపల్లి, తుంబిగనూరు, గరుడచేడు, డి. హోన్నూరు ప్రాంతాల్లో ఇసుక దిబ్బలను పరిశీలించడంతో పాటు అక్కడి పరిస్థితులను కాలవకు వివరించారు. స్థానికంగా ఎడారి నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై చర్చించారు. గోరింటాకు, హెన్నా, పాకుడు తీగల జాతికి సంబంధించిన మొక్కలు పెంచడం ద్వారానే ఎడారి నివారణకు పరిష్కారం లభిస్తుందనే అభిప్రాయాన్ని పరిశీలకుల బృందం కాలవకు వివరించింది. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మొక్కల పెంపకం చేపడుతామని ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ షణ్ముక్‌కుమార్ పేర్కొన్నారు. పూర్తిగా ప్రభుత్వం మొక్కల పెంపకం ఖర్చు భరిస్తుందన్నారు. జిల్లాలో ఎడారీకరణ నివారణే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సమావేశంలో ఉపాధిహామీ పథకం అడిషనల్ కమిషనర్ ఎం. శివప్రసాద్, క్వాలిటీ కంట్రోల్ ముఖ్య అధికారి ఎం. గోపీచంద్, ద్వామా పీడీ సలీం బాషా, వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


ద్వామా రాష్ట్ర పరిశీలకుల బృందం, అధికారులతో మాట్లాడుతున్న కాలవ

## పకడ్బందీగా పాలిసెట్ నిర్వహించాలి : డీఆర్వో


అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో విజయసారథి

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న జిల్లా వ్యాప్తంగా పాలిసెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను డీఆర్వో విజయసారథి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పాలిసెట్ నిర్వహణకు సంబంధించి అధికారులతో డీఆర్వో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 53,326 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని అన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షల సమయంలో గట్టిపోలీసు బందోబస్తుతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ సురేష్ బాబు, హిందూపురం, కదిరి, ప్రిన్సిపాళ్లు హరీష్, రమా, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ ఫిరోజాబేగం, ఆర్టీసీ డీఎం ఇనయతుల్లా, ధర్మవరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు జడ్జిలను కలిసిన జిల్లా న్యాయాధికారి


హైకోర్టు జడ్జిలను కలిసిన న్యాయాధికారి, ఎస్పీలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను జిల్లా న్యాయాధికారి భీమారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఉన్న హైకోర్టు జడ్జిలు జస్టిస్ రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ హరిహరనాథశర్మను ఆయన కలిశారు. ఉమ్మడి జిల్లాల ఎస్పీలు జగదీష్, రత్న కూడా హైకోర్టు న్యాయమూర్తులను కలిశారు.

## డీఎల్ఎస్ఏ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్రైం,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవ అధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శిగా న్యాయాధికారి రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు డీఎల్ఎస్ఏ కార్యదర్శిగా ఉన్న న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అనంతపురం అడిషనల్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో విజయవాడలోని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న న్యాయాధికారి రాజశేఖర్‌ను నియమించారు.

## ఈయూ రాష్ట్ర కార్యదర్శిగా కేబీ నాగార్జునరెడ్డి



ధర్మవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ధర్మవరం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న కేబీ నాగార్జునరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ ఎంపిక స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు, కార్యదర్శి నరసయ్య సమక్షంలో జరిగింది. నూతనంగా ఎంపికైన కేబీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ...ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా అన్నారు.

## ఇంటర్ ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

హిందూపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు చిన్మయ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్టుకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ వెంకట్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో మంచి మార్కులు సాధిస్తే వారికి ఇంటర్‌లో ఉచిత విద్య అందిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ మార్కులు వచ్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పరీక్షలు మే1 నుంచి 3వరకు పట్టణంలోని స్వర్ణభారతి జూనియర్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఉదయం 11గంటల నుంచి 4గంటల మధ్యలో పరీక్షకు హాజరు కావాలన్నారు. పరీక్షకు వచ్చేటప్పుడు ఆధార్, పదోతరగతి మార్కుల జాబితా తీసుకురావాలన్నారు. వివరాలకు 7013721155ను సంప్రదించాలన్నారు.

## రాయదుర్గం మీదుగా సమ్మర్ స్పెషల్ రైలు

రాయదుర్గం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): యశ్వంత్‌పూర్ నుంచి రాయదుర్గం మీదుగా బీజాపూర్ వరకు 06561 నెంబర్‌తో సమ్మర్‌స్పెషల్ రైలును నడుపుతున్నట్లు అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బీఎల్ శివకుమార్ తెలిపారు. యశ్వంత్‌పూర్‌లో 30వ తేదీ రాత్రి 10 గంటలకు బయలుదేరి రాయదుర్గంకు తెల్లవారుజామున 4.48 గంటలకు చేరుతుంది. ఇక్కడి నుంచి 4.50కు బయలుదేరి బీజాపూర్‌కు 2.05 గంటలకు చేరుకుంటుంది. మే 1వ తేదీన బీజాపూర్‌లో 06562 నెంబర్ గల రైలు ఉదయం 11.15 గంటలకు బయలుదేరి తెల్లవారుజామున 2.25 గంటలకు రాయదుర్గంకు చేరుకుని యశ్వంత్‌పూర్‌కు రాత్రి 7 గంటలకు చేరుకుంటుంది. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు తెలిపారు.

## ముగిసిన మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన

### 884 మంది ఉపాధ్యాయులకు అర్హత పత్రాల జారీ


మెడికల్ సర్టిఫికెట్లకు హాజరైన టీచర్లు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. బదిలీల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 24వతేదీ నుంచి 26వరకు మూడురోజులు పాటు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. విద్యాశాఖ, వైద్యశాఖలు సంయుక్తంగా ఈ పరిశీలన ప్రక్రియ కొనసాగించాయి. వ్యాధులకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనకు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, ఆర్ఎంఓలు ప్రత్యేకంగా ఐదుకౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆయా విభాగాల హెచ్ఓడీల సమక్షంలో డాక్టర్లు ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. అర్హత ఉన్నవారికే మాత్రమే మెడికల్ సర్టిఫికెట్లు జారీచేశారు. దాదాపు 1700 మందికి పైగా టీచర్లు పరిశీలనకు హాజరయ్యారు. పరిశీలనలో అర్హత పొందిన 884 మందికి మాత్రమే సర్టిఫికెట్లు జారీచేసినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మూడురోజులుగా ఓ వైపు టీచర్లు మరోవైపు పింఛన్ల లబ్ధిదారుల సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌తో జిల్లా ఆసుపత్రి కిటకిటలాడింది.




ప్రథమ బహుమతి బైక్ అందుకుంటున్న టి. స్వప్న


ద్వితీయ బహుమతి రెఫ్రిజిరేటర్‌ను అందుకుంటున్న మహబూబ్‌పీరా


తృతీయ బహుమతి టీవీ అందుకుంటున్న మహాలక్ష్మి

# ఆంధ్రజ్యోతి ప్రజల పక్షం

### కార్ అండ్ బైక్ రేస్ విజేతలు బహుమతులను అందుకున్న పాఠకులు

అనంతపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రజల పక్షంగా నిలుస్తోందని కార్ అండ్ బైక్ విజేతలు అన్నారు. ఆంధ్రజ్యోతి యాజమాన్యం పాఠకులను ప్రోత్సహించేందుకు నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా విజేతలకు శనివారం బహుమతుల ప్రదానం జరిగింది. ఉమ్మడి జిల్లా, కర్ణాటక పాఠకులు పంపిన 12వేలకుపైగా కూపన్ల నుంచి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, అనంతలక్ష్మి విద్యాసంస్థల ఛైర్మన్ అనంతరాముడు లక్కీ డ్రా విజేతలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ప్రథమ బహుమతిగా కదిరికి చెందిన టి. స్వప్నకు బైక్‌ను, రెండో బహుమతిగా కణేకల్లుకు చెందిన పి.మహబూబ్ పీరాకు రెఫ్రిజిరేటర్‌ను, మూడో బహుమతిగా ధర్మవరానికి చెందిన ఆర్.మహాలక్ష్మికి కలర్ టీవీని ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ గోపాల్‌నాయుడు, బ్యూరో ఇన్‌చార్జ్ రామకృష్ణుడు, డిప్యూటీ మేనేజర్(ప్రకటనలు), డీసీఎం నారాయణస్వామి నాయక్, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ సురేష్‌బాబు తదితరులు అందజేశారు.

**ఎంతో సంతోషంగా ఉంది...**

ఆంధ్రజ్యోతి పాఠకురాలిగా కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో ప్రథమ బహుమతి గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మొదటి నుంచి ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతున్నాం. రాజకీయాలు, ప్రజా సమస్యలు, అవినీతి, అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో వచ్చే వార్తలు చదవించేలా, ఆలోచింపజేసేలా ఉంటాయి.

\- టి. స్వప్న, కదిరి

**మరువలేని బహుమతి..**

సమగ్ర సమాచారాన్ని పాఠకులకు చేరవేసే ఆంధ్రజ్యోతి.. ఇలా ఒక పాఠకుడైన నాకు బహుమతి ఇవ్వడం ఎన్నటికీ మరువలేను. రెండో బహుమతిగా రెఫ్రిజిరేటర్‌ను అందుకుంటున్నాను. చాలా సంతోషంగా ఉంది.

\- పి.మహబూబ్ పీరా, కణేకల్లు

**గర్వపడుతున్నా..**

ఆంధ్రజ్యోతి పాఠకురాలినైనందుకు గర్వపడుతున్నాను. వార్తలతో ప్రజల్లో చైతన్యాన్ని నింపడమే కాకుండా పాఠకులను ప్రోత్సహించేందుకు ఆంధ్రజ్యోతి యాజమాన్యం బహుమతులను ఇవ్వడం సంతోషకరం. వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

\- ఆర్.మహాలక్ష్మి, ధర్మవరం

## జోధ్‌పూర్ తరహాలో మొక్కల పెంపకం

### ఇసుక దిబ్బలను పరిశీలించిన రాష్ట్ర డైరెక్టర్

### ఈ ఏడాది నుంచే పండ్ల మొక్కలు పెంపకానికి శ్రీకారం


దర్గాహొన్నూరు ఇసుక దిబ్బల్లో పర్యటిస్తున్న రాష్ట్ర కమిటీ

బొమ్మనహాళ్/కణేకల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జోధ్‌పూర్ ప్రాంతంలో మాదిరిగా బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని ఇసుక దిబ్బల్లో పండ్ల మొక్కలు పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తామని ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ వైవీకే షణ్ముఖ కుమార్ అన్నారు. దర్గాహొన్నూరు, మాల్యం, నాగేపల్లి, తుంబిగనూరు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఇటీవల రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ ప్రాంతంలో రాష్ట్ర కమిటీ పర్యటించి ఈ ప్రాంత పరిశీలనకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇసుక దిబ్బల్లో పర్యటిస్తూ కొందరు రైతులు సాగు చేసిన పండ్ల మొక్కలను పరిశీలించారు. వాటి పెంపకంపై రైతులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఇక్కడి ఇసుక దిబ్బలు ఏ పంటల సాగుకు అనుకూలమైనవో పరిశీలన చేసి త్వరలో రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. ఇసుక దిబ్బల వల్ల ఈ ప్రాంతానికి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు. దిబ్బల్లో తక్కువ నీటి సామర్థ్యంతో పండ్ల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఐదెకరాలోపు ఉన్న వారికి ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు అదజేస్తామని తెలిపారు. ఎక్కువ భూములు ఉన్న రైతులు వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఈ ప్రాంతంలో సపోట, నేరేడు, రేగడి పండ్లు పెంచేందుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపిచంద్, అనంతపురం డ్వామా పీడీ సలీమ్‌బాషా, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్, ఏఓ సాయికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ సుధాకర్, టీఏ సోమన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**మొక్కలు ఉచితంగా ఇవ్వాలి**

ఇసుక దిబ్బల్లో ఐదెకరాలు పైబడిన రైతులు అధికంగానే ఉన్నారు. వారికి కూడా పండ్ల మొక్కలు ఉచితంగా ఇవ్వాలి. అలాగే డ్రిప్ సౌకర్యం కల్పించాలి. చెట్లు పెద్దవి అయ్యేవరకు వాటి సంరక్షించేందుకు అధికారులు అన్ని విధాలుగా సహకరించాలి.

\- ముక్కన్న, రైతు, దర్గాహొన్నూరు



**ఇసుక తరలించాలి**

గోవిందవాడ ప్రాంతంలో దిబ్బలు నుంచి ఇసుకను బీడు భూములకు ఉచితంగా తరలించాలి. మాకు 16 ఎకరాలు ఉంది. ముగ్గురు అన్నదమ్ములు ఉన్నాం.

\- గురుమూర్తి, రైతు, గోవింద

## వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం

### రాష్ట్ర రవాణా క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మడకశిర, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నాశనమయ్యాయని రాష్ట్ర రవాణా క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. ఏబీసీడీలు రాని వారికి మంత్రి పదవులు ఇవ్వడంతో ఇరిగేషన్ శాఖతో పాటు పలుశాఖల్లో విధ్వంసం జరిగిందన్నారు. మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో ఆర్టీసీతో పాటు ఇతర శాఖలు కూడా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు స్వీకరించాక అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నారన్నారు. రాబోయే ఏడాదిన్న కాలంలో రాష్ట్రంలో రెండు వేల ఎలక్ట్రికల్ బస్సులు రోడ్డుపైకి వస్తాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అమరావతి పునఃనిర్మాణ పనులను శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రూ. రెండువేల కోట్లతో కడప, కర్నూలులో ఎస్ఈజడ్ పనులు చేపట్టడం, గోదావరి జలాలతో రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్రైం/అనంతపురం టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, పారిశుధ్యం, రోడ్లు, తాగునీటి సరఫరా, వీధిలైట్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో పారిశుధ్యంపై శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్, మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్, కమిషనర్ బాలస్వామి, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాల్టీలో పరిశుభ్రతను టీం వర్క్‌గా నిర్వహించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ ఉదయం 6గంటలకు ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

**ఇసుక నిల్వ ఉంచండి**

రాబోయే వర్షాకాలంలో అభివృద్ధి పనులకు సరిపడా ఇసుక నిల్వ ఉంచాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇసుక నిల్వలపై శనివారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో వర్షాకాలం నాటికి 70వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉండాలన్నారు. సమావేశంలో మైన్స్‌డీడీ వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, గ్రౌండ్‌వాటర్ డీడీ తిప్పేస్వామి, ఆర్టీఓ సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

**టెన్త్ టాపర్స్‌కు సత్కారం**

ప్రభుత్వ బడిలో చదివి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కలెక్టరేట్‌లో శనివారం విద్యాశాఖ పరిధిలో 15మంది, బీసీ వెల్ఫేర్ పరిధిలో 15మంది, ట్రైబల్‌వెల్ఫేర్‌లో ఆరుగురు, కేజీబీవీలలో ఆరుగురు, ఎస్సీ వెల్ఫేర్‌లో ఆరుగురు చొప్పన మొత్తం 48మందిని కలెక్టరు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్ బాబు, సంక్షేమ శాఖల అధికారులు, టాపర్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**అనంత ఆణిముత్యాలకు ఆర్థిక సాయం**

జిల్లాలో పేద ఉత్తమ విద్యార్థుల చదువుల కోసం అమలు చేస్తున్న అనంత ఆణిముత్యాలు ఎడ్యుకేషన్ సొసైటీకి రెవెన్యూ, విద్యుత్‌శాఖలు విరాళం అందించాయి, రెవెన్యూశాఖ ఉద్యోగులు రూ.50వేలు, విద్యుత్‌శాఖ ఉద్యోగులు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. భూ సంరక్షణ విభాగం తహసీల్దారు రూ.50వేలు, విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్ రూ.25వేలు విరాళం వ్యక్తిగతంగా కలెక్టర్‌కు అందజేశారు.

## వీరాపురాన్ని అభివృద్ధి చేస్తాం: కలెక్టర్ చేతన్

చిలమత్తూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సైబీరియన్ వలస పక్షులు విడిది చేసే వీరాపురం, వెంకటాపురం గ్రామాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. ఈ నెల 21న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అతిథుల ఆకలి కేకలు' కథనానికి స్పందించిన కలెక్టర్, శనివారం ఆ రెండు గ్రామాలను సందర్శించారు. మిద్దెలపైకి ఎక్కి చెట్లపై ఉన్న వలస పక్షులను వీక్షించారు. పక్షుల సంరక్షణ గురించి గ్రామస్థులతో మాట్లాడారు. ఏటా జనవరిలో వచ్చి ఆగస్టు వరకు ఉండి, సంతతిని వృద్ధి చేసుకుని తిరిగి వెళతుంటాయని గ్రామస్థులు ఆయనకు వివరించారు. అయితే కరువు పరిస్థితులు ఉన్నప్పుడు పక్షులు రావని, వాతావరణ పరిస్థితులను ముందుగానే పసిగట్టి రాకుండా ఉండిపోతాయని వివరించారు. పక్షులు గ్రామానికి రాకపోతే కరువు వస్తుందని తమకు అర్థమవుతుందని అన్నారు. పక్షులకు వేసవిలో ఆహారం, నీటి సమస్య ఉంటోందని, పరిష్కరించాలని కోరారు. దీంతో కలెక్టర్ అటవీ శాఖ అధికారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి, పెనుకొండ రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ వెంకటేశులు, సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి ఉన్నారు.


వీరాపురంలో బైనాక్యులర్‌తో పక్షులను వీక్షిస్తున్న కలెక్టర్

## నగరంలో ఐదిళ్లలో చోరీ

### రూ.5వేలు తస్కరించిన దొంగలు... లాకర్లలో పెట్టడంతో బంగారం సేఫ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎవరెవరు ఇళ్లల్లో ఉండరో రెక్కీ నిర్వహించారు. అన్నీ దగ్గర దగ్గరగా ఉన్న ఇళ్లనే ఎంచుకున్నారు. తదుపరి ఐదు ఇళ్లలోకి చోరీకి వెళ్లిన దొంగలకు నిరాశే మిగిలింది. ఇంటికో వెయ్యి చొప్పున రూ.5వేలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అందులో నాలుగు కుటుంబాలు బంగారం బ్యాంకు లాకర్లలో ఉంచడంతో సేఫ్ అయింది. మరో కుటుంబం ఇంట్లోనే రహస్యంగా ఉంచడంతో దొంగలు గుర్తించలేకపోయారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక నగరంలోని గౌరవ్‌గార్డెన్స్‌లో దొంగలు పడ్డారు. అక్కడ పక్కపక్క ఇళ్లలోనే నివాసముంటున్న మణికంఠారెడ్డి, బసవేశ్వరగౌడ్, విజయభాస్కర్, జితేంద్రమౌళి, శివకుమార్ కుటుంబాలు బంధువుల ఇళ్లకు, వేరే ఊర్లకు వెళ్లారు. ఆ ఇళ్లల్లో జరిగిన దొంగతనం శనివారం ఉదయం వెలుగు చూసింది. వీరిలో నాలుగు కుటుంబాల బంగారం లాకర్లలో ఉందని, చిన్న, చిన్న వస్తువులు దొంగతనం జరిగినట్లు పోలీసులకు తెలిపారు. కియ కంపెనీలో పనిచేస్తున్న శివకుమార్ ఇంట్లోని బీరువాలో రూ.5వేలు దొంగిలించుకుపోయారు. అదే ఇంట్లోని 8తులాల బంగారు ఆభరణాలు రహస్యంగా ఉంచడంతో దొంగలకు దొరకలేదు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇద్దరు దొంగలు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

**గస్తీ ఏమైంది...?**

రాత్రి 1గంట నుంచి తెల్లవారుజాము 4గంటల మధ్యలో ఈ దొంగతనాలు జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు రెండు, మూడు గంటలు దొంగలు దర్జాగా ఆ ఇళ్లల్లో విలువైన వస్తువుల కోసం వెతికారు. కానీ పోలీసులు అటువైపు గస్తీ నిర్వహించినా పరారయ్యేవారేమో. పోలీసులు గస్తీ అటకెక్కించారనేందుకు ఈ సంఘటనే ఉదాహరణ అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## జేఎన్‌టీయూకు ఉత్తమ ర్యాంకు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ నిర్వహించిన సర్వేలో జేఎన్‌టీయూ అనంతపురానికి ఉత్తమ ర్యాంకు దక్కింది. ఆ సంస్థ ఆసియాలో ఉన్న యూనివర్సిటీల్లో మెరుగైన ప్రతిభ కనబరుస్తున్న వాటికి ర్యాంకులు కేటాయించింది. ఇందులో భాగంగా పనితీరుపై 18 సూచికలను పరిగణనలోకి తీసుకుంది. వాటి ఆధారంగా యూనివర్సిటీలకు ర్యాంకులు కేటాయించింది. ఇందులో 251-300 బ్యాండ్‌లో జేఎన్టీయూ నిలిచి రాష్ట్రంలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. దీంతో వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య హర్షాన్ని వ్యక్తం చేశారు. ప్రొఫెసర్లు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు.

## రేపటి నుంచి వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లోనూ 28వ తేదీ నుంచి వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చే జూన్ 6వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ కథలు వినడం, పుస్తకం చదవవడం, చెస్, క్యారమ్స్ ఆడటం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్ వంటి అంశాలపై పిల్లలకు శిక్షణ ఉంటుందన్నారు.

# తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం వీడండి



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

### మున్సిపల్ కమిషనర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 'మున్సిపాల్టీ ప్రజలకు తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం ఎందుకు.. ఆ సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారు.. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది..' అని ఎమ్మెల్యే పల్లెసింధూరా రెడ్డి మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాదను హెచ్చరించారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. మున్సిపాల్టీలోని పలు వార్డుల్లో తాగునీటి సమస్యలున్నట్లు తనకు ఫిర్యాదులు అందాయన్నారు. శిల్పారామం కాలనీలో కొత్త బోరు వేసి మూడు మాసాలు అవుతున్నా.. అది ఇంతవరకూ ఎందుకు వినియోగంలోకి తేలేదని ప్రశ్నించారు. పట్టణంలో ప్రధాన వీధులు, అవసరమైన చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వీడాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ చైర్మన్లు పీసీ గంగన్న, బెస్త చలపతి, కన్వీనర్ రామాంజినేయులు, సామకోటి ఆదినారాయణ, రామారావు, అంబులెన్సు రమేష్, కృష్ణప్రసాద్, శుభచంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● పోషణ్ పక్వాడాలో..

పుట్టపర్తిలోని ఆర్వీజే కళ్యాణమండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడా పోషకాహార పక్షోత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 15 మంది గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీ శ్రీదేవి, సీడీపీఓ గాయత్రి, సీఐ సునీత, ఐసీడీఎస్ సూపర్వైజర్లు కౌశల్య, సాయిభారతి, పుష్పలత, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● సీహెచ్ఓల వినతి

వైద్యఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రజారోగ్య వ్యవస్థలో సేవలందిస్తున్న సీహెచ్ఓల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు సీహెచ్ఓలు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీహెచ్ఓ సంఘం జిల్లా అధ్యక్షుడు నిరంజన్, ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్, స్టేట్ కో-ఆర్డినేటర్ వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం

నంబులపూలకుంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదురుదొన గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన వరుణ్ ఆదిత్య కుమార్.. కదిరి మండలంలోని కాళసముద్రం గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివాడు. చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. తల్లి, అవ్వతాతలు కూలి పనులకు వెళ్తూ.. జీవనం సాగిస్తున్నారు. అలా వచ్చిన డబ్బులతో ఆదిత్యను చదివించారు. ఇటీవల టెన్త్ ఫలితాల్లో అతను 587 మార్కులు సాధించాడు. దీంతో అతన్ని దళిత నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జయరాం, రెడ్డెప్ప, ఓబులేసు, శ్రీనివాసులు, ఆదినారాయణ, హరి, రామాంజి, క్రిష్టప్ప, నారాయణ, లక్ష్మణ పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : మండలంలోని చవిటితండాలో ఐదుగురు గిరిజన విద్యార్థులు పది ఫలితాల్లో మంచి మార్కులు సాధించారు. ఆ విద్యార్థులను హార్టు టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఒకొక్కరికి రూ.రెండువేల చొప్పున ప్రోత్సాహక బహుమతులను ఆ ట్రస్టు అధ్యక్షుడు మూడు రవినాయక్ అందజేశారు.



ఎదురుదొనలో వరుణ్ ఆదిత్య కుమార్‌ను, చవిటి తండాలో విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

### రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వాలి



సీఎస్‌డీటీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో మే నెలలోనైనా రేషన్ బియ్యం సక్రమంగా సరఫరా చేయాలని సీపీఐ నాయకులు సీఎస్‌డీటీ మునిస్వామికి శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఏడు నెలలుగా మండలంలో రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ కాకపోవడంతో కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీలర్లు సకాలంలో పంపిణీ చేయలేక పోతుండడంతో, కార్డుదారులు గంటలు తరబడి డీలర్ల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడుతోందన్నారు. ఇప్పటికైనా రేషన్ బియ్యం సక్రమంగా... సకాలంలో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో రేషన్ కార్డుదారులతో కలసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిప్పయ్య, వెంకటరాముడు, చిన్నప్ప, రాధాకృష్ణ పాల్గొన్నారు.

### ఆర్డీటీ విదేశీ నిధులకు కేంద్రం అనుమతివ్వాలి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 'రూరల్ డైవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ ) విదేశాల నుంచి నిధులు తెచ్చి ఉమ్మడి జిల్లాలో పలు సేవలను అందించేది. అయితే ఇటీవల వివిధ దేశాల నుంచి సంస్థలకు అందుతున్న ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం ఫారిన్ కంట్రీబ్యూషన్ రెగ్యులేషన్ యాక్టు కింద అడ్డుకుంది. దీంతో ఆర్డీటీకి విదేశీ ఆర్థిక సాయం అందడం లేదు. ఈ కారణంగా ఆర్డీటీ సేవలు పేదలకు అందుకుండా పోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం స్పందించి సంస్థకు విదేశాల నుంచి అందే ఆర్థిక సాయం పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలి..' అని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ కోరారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ఆర్డీటీ సేవలు ఆగిపోయే ప్రమాదముందన్నారు.

● నల్లమాడ : ఆర్డీటీకి విదేశాల నుంచి వచ్చే నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని, వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుచ్చెపు చంద్ర శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఆర్డీటీ సంస్థ పలు సేవాకార్యక్రమాలను చేపడుతోందని, విదేశీ నిధులు రాకపోతే ఆ సేవలు అగిపోతాయన్నారు.

● ఓబుళదేవరచెరువు : ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ (విదేశీ విరాళాల చట్టం) రెన్యువల్‌ను పునరుద్ధరించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు, మండల కార్యదర్శి చలపతినాయుడు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ అనంతాచారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలపతి, రత్నాబాయి, రామచంద్ర, రమణ పాల్గొన్నారు.

### ప్యానల్ చైర్‌పర్సన్‌గా హరిణి



కదిరి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. చైర్‌పర్సన్ లేకపోవడంతో ప్యానల్ చైర్‌పర్సన్‌గా ఉన్న 16 వార్డు కౌన్సిలర్ పి.హరిణి కౌన్సిల్ సమావేశానికి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని కమిషనర్ తెలిపారు.

## శ్మశాన స్థల వివాదం

### తొండమాల రవితో టీడీపీ నాయకుల వాగ్వాదం



తొండమాల రవితో టీడీపీ నాయకుల వాగ్వాదం

ధర్మవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం సమీపంలోని హమాలీ కాలనీ వద్ద గల సర్వే నంబరు 649లో శ్మశాన వాటిక స్థలంపై వివాదం తలెత్తింది. 12వ వార్డు కౌన్సిలర్ రమాదేవి భర్త తొండమాల రవి ఇటీవల వైసీపీ నుంచి జనసేనలో చేరాడు. ఆ స్థలాన్ని రవి శనివారం చదును చేయిస్తుండగా 26వ వార్డు కౌన్సిలర్ రాయపాటి రామకృష్ణ, 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం గౌడ్, నాయకులు చీమల రామాంజి, సూరి అడ్డుకున్నారు. ఆ స్థలాన్ని బేల్దారి యూనియన్ సంఘం నుంచి స్థలాన్ని తాను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని తొండమాల రవి తెలిపారు. అయితే ఆ స్థలం శ్మశాన వాటికకు సంబంధించిందని, పత్రాలు చూపాలని వాగ్వాదానికి దిగారు. ఇరువురి మధ్య గొడవ జరుగుతుండగా వన్‌టౌన్ పోలీసులు, మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఆ స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి హద్దులు చూపిస్తామని నచ్చజెప్పి .. ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు.

## పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

### మున్సిపల్ కార్యాలయం వద్ద రిలేదీక్షలు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు జీఎల్ నరసింహులు మాట్లాడుతూ.. పేదలకు పట్టణప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడుసెంట్లు స్థలాలు ఇవ్వాలన్నారు. అలాగే టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు స్వాధీనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబశివ, బాబ్‌జాన్, జగన్మోహన్, శాంతిబాయి, రామమోహన్, నారాయణ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



రిలేదీక్షలు చేస్తున్న సీపీఎం నాయకులు

## ఉగ్రదాడిపై నిరసన వెల్లువ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : పహల్గామ్‌లో ఉగ్రదాడిపై నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. శనివారం తలుపుల, నల్లచెరువు, నంబులపూలకుంటలో టీడీపీ, బీజేపీ నాయకులు, స్థానికులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీలు చేపట్టారు. ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్స్ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు.



నంబులపూలకుంటలో కొవ్వొత్తులతో ర్యాలీ



తలుపులలో కొవ్వొత్తులతో.. మానవహారంగా ఏర్పడి నిరసన



నల్లచెరువులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

## న్యూస్ బాక్స్

### చేనేత సమస్యలను పరిష్కరించాలి

ధర్మవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌హెచ్‌బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులకు నేతన్న నేస్తం కింద రూ. 24 వేలు ఇవ్వాలని, 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు చేయాలని, ముద్రా రుణాలు ఇవ్వాలని, రుణ మాఫీ చేయాలని, ఇంటి స్థలాలు ఇవ్వాలని, చేనేతలకు 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చేనేత సంఘం పట్టణ కమిటీ కన్వీనర్‌గా గుంపు హరి, కో కన్వీనర్ ఖాదర్‌బాషాను ఎన్నుకున్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

గాండ్లపెంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : ఉపాధి పథకంలో పండ్లతోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎపీఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతుల నుంచి పండ్లతోటల పెంపకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు రేషన్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, బాజ్‌కార్డు, ఆధార్, చిన్నసన్నకారు ధ్రువీకరణంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### మిట్టపల్లి టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక



నాగరాజు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లి టీడీపీ గ్రామ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ పార్టీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబులరెడ్డి ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వల్లం నాగరాజు, ఉపాధ్యక్షుడిగా పి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా తలారి శ్రీనివాసులు, కోశాధికారిగా రామక్రిష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శులు గా పూలకుంట శివయ్య, మంగరాజు రమణ, వెంకటశివ, కార్యదర్శులుగా సరిటాల మాబూ బాబాసాబ్, దస్తగిరిని ఎన్నుకున్నారు.

### బీమా రంగంలో విదేశీ పెట్టుబడులు వద్దు

కదిరి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో విదేశీ పెట్టుబడులు వద్దని, దీనికి వ్యతిరేకంగా మే 20న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని జాతీయ ఉపాధ్యక్షుడు పి. సతీష్ బాబు పిలుపునిచ్చారు. ఎల్‌ఐసీ ఉద్యోగుల సమస్యలపై శనివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఆర్‌డీఏ సంస్థ ప్రైవేటు ఇన్సురెన్స్ కంపెనీలకు పనిచేస్తూ ఎల్‌ఐసీని బలహీన పరిచేలా వ్యవహరిస్తోందన్నారు. ఎల్‌ఐసీలో ఖాళీను భర్తీ చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

### ఇస్కాన్‌లో రేపటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదనగర్‌లోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరంలో ఈనెల 28 నుంచి మే18 వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ధర్మవరం ఇస్కాన్ ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాధవదాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, ఆర్ట్స్, నృత్యాలు, భక్తిగీతాలు, భాగవతకథలు, హరినామజపం, సంకీర్తనలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మకతను పెంపొందించేందుకు ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4-14 సంవత్సరాల్లోపు విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

### లాడ్జిలలో తనిఖీలు



లాడ్జిలో రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

ధర్మవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): భారత్‌పై ఉగ్ర దాడి నేపథ్యంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప తమ సిబ్బందితో పట్టణంలోని లాడ్జీల్లో శనివారం తీనిఖీ చేపట్టారు. లాడ్జిలకు వచ్చే వారి వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం ప్రధాన కూడళ్లలో వాహనాలను తనిఖీ చేశారు.

### అలరించిన సంగీత విభావరి



భక్తిగీతాలు ఆలపిస్తున్న నాగర్ కర్నూల్ భక్తులు



పుట్టపర్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ భక్తుల సంగీత విభావరి భక్తులను అలరింపచేసింది. నాగర్ కర్నూల్ భక్తులు పర్తియాత్రతో శనివారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయికుల్వంతు సభా మండపంలో తందులార్చన పేరిట పూజాకార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తిపాటలను ఆలపించారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

### తక్కువ ఎత్తులో విద్యుత్ వైర్లు

కొత్తచెరువు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతులకుంట గ్రామంలో విద్యుత్ వైర్లు చాలా తక్కువ ఎత్తులో ఉన్నాయి. అటు వైపు వెళ్లాలంటే ఆ తీగలను ఎత్తుకొని.. వెళ్లాల్సి ఉంది. ఎండాకాలంలో ఓవర్ లోడ్ వల్ల ఆ తీగలపై ఉన్న ప్లాస్టిక్ మెల్ట్ అయిందని, దీంతో పొరపాటున ఆ ప్రాంతంలో తీగలను తాకితే ప్రాణ నష్టం జరిగే ప్రమాదముందని ఆ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

## క్రైం న్యూస్ ..

### వడదెబ్బతో వ్యక్తి మృతి



మల్లికార్జున గౌడ్ (ఫైల్)

గాండ్లపెంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మల్లికార్జునగౌడ్ (55) వడదెబ్బతో శనివారం మరణించినట్లు బంధువులు తెలిపారు. వారు తెలిపిన సమాచారం మేరకు.. మల్లికార్జునగౌడ్ రోజూ కదిరికి వెళ్లి అక్కడ ఓ హోటల్‌లో పనిచేసేవాడు. అతని భార్య గాండ్లపెంటలోని తన ఇంటి వద్ద సరుకుల దుకాణాన్ని నిర్వహిస్తోంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శనివారం హోటల్ పని చేయడానికి వెళ్లిన మల్లికార్జునగౌడ్ తీవ్రమైన ఎండ, వేడికి వడదెబ్బకు గురయ్యాడు. తల తిరిగి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అతన్ని గాండ్లపెంటకు తీసుకొని రాగా.. స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు మారుతీ మహేశ్వర్ పరిశీలించి.. అతను మరణించినట్లు ధ్రువీకరించారు. ఉన్న పెద్ద దిక్కు చనిపోవడంతో ఆ కుటుంబ దిక్కులేనిది అయిందని, ప్రభుత్వమే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు, బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు ..

కదిరిఅర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముదిగుబ్బకు చెందిన వెంకటేష్ (40) అక్కడికక్కడే మరణించాడు. అతను స్నేహితుడు మల్లికార్జునాయక్‌తో కలిసి బైక్‌పై కదిరికి బయలుదేరాడు. పట్నం వద్ద ఆ వాహ న అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో వాహనంలో వెనుక కూర్చొన్న వెంకటేష్‌నాయక్ తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందారు. మల్లికార్జున్‌నాయక్‌కు తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటేష్‌నాయక్ మృతదేహన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

### పోక్సో కేసు నమోదు

గాండ్లపెంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామాని కి చెందిన ఏడేళ్ల బాలికపై 17 ఏళ్ల బాలుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై ఆ బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఆ బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశామని, కేసు దర్యాప్తులో ఉందని హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు.



జ్యోతులు, బోనాలను తీసుకెళ్తున్న గ్రామస్థులు

### భక్తిశ్రద్ధలతో స్వామికి జ్యోతులు, బోనాలు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లిలో నలగొండరాయుడు స్వామికి శనివారం జ్యోతులు, బోనాలు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు ఇంటింటికి జ్యోతులు, బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి స్వామివారికి సమర్పించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు చేశారు.

### ఖాద్రీశుడి ఆలయం కిటకిట



ఆలయంలో భక్తుల రద్దీ

కదిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం ... పాఠశాలలకు సెలవులు కావడంతో భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకోవడానికి శుక్రవారం రాత్రే కదిరికి చేరుకున్నారు. స్వామివారి ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

ధర్మవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో నిర్మిస్తున్న వైద్యనారాయణ ఆలయానికి ధర్మవరం పట్టణానికి చెందిన శంకరనారాయణ, రవీంద్ర, మల్లికార్జున రూ.50 వేలు విరాళం అందజేశారు. ఆ డబ్బును శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

### రహదారి సమస్యలపై ఆర్డీఓ విచారణ



రహదారి సమస్యపై ఆరా తీస్తున్న ఆర్డీఓ

కొత్తచెరువు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాపురం హరిజనవాడలో రహదారి సమస్యపై ఆర్డీఓ సువర్ణ శనివారం విచారణ చేపట్టారు. ఆ కాలనీకి చెందిన సోమప్ప స్పందనలో రహదారి ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. దీంతో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ నీలకంఠారెడ్డి శనివారం ఆ గ్రామానికి వెళ్లారు. పంచాయతీ రూల్స్ ప్రకారం ఎవరైతే అక్రమ నిర్మాణాలు చేపట్టారో వారికి నోటీసులు జారీ చేసి ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్‌కు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం మైలేపల్లి సమీపంలో భూ సమస్యను పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దార్‌కు ఆర్డీఓ సూచించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది రైతులు, గ్రామస్థులు ఉన్నారు.

**న్యూస్ బాక్స్**

## తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

- తహసీల్దార్ మారుతి



ట్యాంక్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మారుతి

గోరంట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ మారుతి హామీ ఇచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని పాలసముద్రం వాసులు తమ నివాసాలకు హక్కులు కల్పించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో పాలసముద్రం కూడలిలో నిరుపయోగంగా ఉన్న ట్యాంక్‌ను తహసీల్దార్ శనివారం పరిశీలించారు. ట్యాంక్ మరమ్మతుల కోసం, పైపులైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్

పెనుకొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. శనివారం సీఐటీయూ సర్వసభ్య సమావేశం బాబావలి, బావమ్మ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్ మాట్లాడుతూ మేడేను ఘనంగా నిర్వహించడానికి అందరి సహకారం అవసరమన్నారు. ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ కార్మికులకు అండగా ఉండి వారి హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సీఐటీయూ నాయకులు మహబూబ్‌బాషా, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ నాయకులు జయమ్మ, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్నవెంకటేశ్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు తులసీ, రాజేశ్వరి, తోపుడుబండ్లయూనియన్ నాయకులు హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధిచెందిన దక్షిణ ముఖ ఆంజనేయస్వామి ఊరువాకిలి ఆంజనేయస్వామి, వజ్రముష్టి ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం అర్చకులు స్వామివారికి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## సమస్యలు తెలుసుకోవడానికే శుభోదయం

-టీడీపీ నాయకులు



మురుగు కాలువను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సమస్యలు తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికే ప్రజల ముందుకు వచ్చామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం శుభోదయం కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీరాములయ్య కాలనీలో నాయకులు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలతో మాట్లాడారు. కాలనీలో డ్రైనేజీలు, చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని ప్రతిరోజూ చెత్తను తొలగించి శుభ్రం చేయాలని, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలన్నింటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని వారు కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ శ్రీరాములు, రమణమ్మ, పాలడుగు చంద్ర, సాయిప్రసాద్, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, షౌకత్, మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, ప్రభంజన్ పాల్గొన్నారు.

## సీపీఐలోకి చేరిక

సోమందేపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం పలువురు బాలస్వామి రమేష్ ఆధ్వర్యంలో పార్టీలోకి చేరారు. శ్రీకాంత్, గంగరాజు, బాబాజాన్ పార్టీతీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, చాంద్‌బాషా, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కరపత్రాలు విడుదల

అగళి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు ఆధ్వర్యంలో అంబేడ్కర్ సేవా పురస్కార కరపత్రాలు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు ఎం శ్రీనివాస్, ఎంఎస్ రఘునాథ్, మరం లక్ష్మీనారాయణ, రవితో కలిసి సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు కృషిచేసిన వారికి, సమాజసేవ చేస్తున్న కార్యకర్తలకు అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా సేవా పురస్కారాలను ప్రదానం చేయనున్నామన్నారు. కార్యక్రమం ఈనెల 29న మడకశిరలో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అగళి మండల దళిత నాయకులు కాంతరాజు, కిట్టి, నాగోజీ, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

లేపాక్షి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన రాగులను కొనుగోలు చేసేందుకు కేంద్రాన్ని ప్రభుత్వం శనివారం ప్రారంభించింది. ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ జయప్ప కోరారు. క్వింటాల్ రూ. 4290గా నిర్ణయించడం జరిగిందని, కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# బెంబేలెత్తిస్తున్న సిమ్‌కార్డ్ మోసాలు

### ఆదమరిస్తే కేటుగాళ్ల చేతికి వివరాలు
### బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు ఖాళీ
### తెలియకుండానే యాప్‌ల ద్వారా రుణాలు



హిందూపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో పలు అవసరాలు సిమ్‌తో ముడిపడి ఉన్నాయి. బ్యాంక్ లావాదేవీల వివరాలు సంక్షిప్త సందేశాలు మొబైల్ ఫోన్‌లకే వస్తున్నాయి. ఆధార్‌కు ఫోన్‌నంబరు అనుసంధానం చేయడంతో రిజిష్టర్ మొబైల్ నెంబరు నుంచి డయల్‌చేసి ఫోన్ బ్యాంకింగ్ ద్వారా వివిధ లావాదేవీలు నిర్వహించవచ్చు. ఖాతా నిల్వ, నగదు బదిలీలు వంటివి చేసుకునే వెసలుబాటు ఉంది. మొబైల్‌బ్యాంకింగ్‌లోనూ, నంబరుకే ఓటీపీలు వస్తాయి. సామాజిక మాధ్యమాలైన వాట్సాప్ తదితర వాటిల్లో ప్రవేశించాలంటే మొబైల్ నంబరు తప్పనిసరి అవుతుంది. ఇలా అన్ని అవసరాలకు అవసరమైన సిమ్ములకు సంబంధించి పలు మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇవి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.

**ఖాతాలపై నియంత్రణ**

సిమ్ము స్వాప్ ద్వారా ఇతరుల సిమ్ములోని వివరాలను కొత్తకార్డుల్లోకి బదిలీ చేస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా సెల్‌ఫోన్ వినియోగదారులను సులువుగా మోసం చేస్తున్నారు. సిమ్ముపై 15అంకెల విశిష్ట సంఖ్య ముద్రించి ఉంటుంది. ఈ సంఖ్య తెలిపితే చాలు కేటుగాళ్లు ఖాతాల నుంచి డబ్బు స్వాహా చేస్తున్నారు. ఫలానా నెట్‌వర్క్ నుంచి ఫోన్ చేస్తున్నామని డయల్ చేస్తుంటారు. ఈ మధ్య ఫోన్ హ్యాకింగ్ అవుతున్నాయని చెబుతున్నారు. ఇందుకు రక్షణకు 15అంకెల విశిష్ట సంఖ్యను పంపుతున్నామని దానిని కంపెనీకి ఎస్‌ఎంఎస్ చేయాలని సూచిస్తారు. దీనిపై ఎవరికి అనుమానం రాకుండా వ్యవహరిస్తున్నారు. దీంతో వారు సూచించిన విధంగా చేస్తే మన సిమ్మునుంచి వివరాలు బదిలీ అవుతాయి. దీంతో మనసిమ్ము పనిచేయడం ఆపేస్తుంది. ఓటీపీ వివరాలు మోసగాళ్ల సెల్‌కు వెళ్తాయి. వారికి కావాల్సిన పని సాఫీగా సాగుతుంది.

**నకిలీ వేలిముద్రలు, ధ్రువీకరణ పత్రాలు**

సిమ్‌కార్డు కోసం ఇతరుల వేలిముద్రలు తీసుకుని వాటిని సిలికాన్ తొడుగులపై ముద్రించి మోసాలు చేస్తున్నారు. మనకు తెలియకుండానే వేలిముద్రలు సేకరించి సిమ్‌కార్డుకు దరఖాస్తుచేసి తీసుకుంటున్నారు. బోగస్ డాక్యుమెంట్లు ఫోటోలు ఉపయోగించి సిమ్‌కార్డును సంపాదిస్తున్నారు. వీటి ద్వారా వివిధ నేరాలకు పాల్పడుతున్నారు. టెలికాం ఆపరేటర్లు ఎక్కువ సిమ్‌కార్డులు విక్రయించే ఏజెన్సీలకు పారితోషికాలు మంచి కమిషన్ ఇస్తున్నారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు ఆధారాలు సైతం పరిశీలించకుండా విచ్చలవిడిగా సిమ్‌కార్డులు అందజేస్తున్నారు. దీనివల్ల దొంగల పని సజావుగా సాగిపోతోంది.

**మచ్చుకు కొన్ని...**

● పట్టణంలోని డీఆర్‌కాలనీలో నివాసమున్న ఓ ప్రైవేట్ ఉద్యోగి సెల్‌నంబరు గత యేడాది డిసెంబర్ మొదటి వారంలో బ్లాక్ అయినట్లు మెసేజ్ వచ్చింది. పది నిమిషాల వ్యవధిలో పలు మెసేజ్‌లు ఫోన్‌కు రావడంతో అనుమానం వచ్చి ఆయన ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. అయినా ఆయనఖాతాలో రూ.50వేలు నగదు ఉండగా ఖాతా ఖాళీ అయింది. గంట తరువాత ఫోన్ ఆన్‌చేయగా ఆయన ఫోన్‌చేస్తే పోతున్నాయి తప్ప ఇతరుల నుంచి వచ్చేఫోన్‌లు ఆయనకు రావడంలేదు. దీంతో అనుమానం వచ్చి వెంటనే వినియోగదారుల కేంద్రానికి వెళ్లి ఆరాతీయగా అప్పటికే నగదు ఖాళీ అయింది.

● హిందూపురం పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసముండే గృహిణి సెల్‌నంబరు ఎవరికీ ఇవ్వలేదు. అయినా ఆ నెంబరు గత నెలలో ఒక రోజు బ్లాక్ అయినట్లు సమాచారం వచ్చింది. అంతే ఆ తరువాత పదిరోజులకు ఆమెపేరుమీద రూ.50వేలు రుణం పొందినట్లు సమాచారం అందింది. ఎవరు తీసుకున్నారని ప్రశ్నించగా ఈనెంబరు మీదే ఇచ్చామని కట్టకపోతే ఈ నంబరును బ్లాక్‌చేస్తామని చెప్పడంతో చేసేదిలేక కొంత మొత్తన్ని కట్టి ఆ సిమ్మును స్విచ్‌ఆఫ్ చేశారు.

● తూముకుంటకు చెందిన ఒక పరిశ్రమలో పనిచేసే కార్మికుడు పదేళ్ల క్రితం సిమ్‌కార్డు కొన్నాడు. దానిమీద నగదు లావాదేవీలు జరుగుతున్నాయి. కానీ గత నెలలో అతనికి సిమ్‌కార్డుపై ఉన్న 15అంకెల నంబరు చెప్పాలని కోరారు. దీంతో ఆయన సిమ్‌కార్డుపై ఉన్న నంబరు చెప్పాడు. దీంతో అతని ఖాతాలో ఉన్న రూ.12వేలు నగదు ఖాళీ అయింది. అయితే ఎలా నగదు వెళ్లిందో సతమతపడ్డారు. మినీస్టేట్‌మెంట్ తీయగా వేరే నంబరుకు బదిలీ అయినట్లు గుర్తించాడు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఉద్యోగి పేరుమీద వేరే వ్యక్తులు సిమ్‌కార్డు కొనుగోలుచేసి నేరాలకు పాల్పడ్డారు. ఇటీవల ఆ నంబరు ఆరాతీయగా హిందూపురానికి చెందిన వ్యక్తి పేరుపై వచ్చింది. ఆయన నేనెప్పుడూ ఈఫోన్‌నంబరు వాడలేదన్నారు. ఇవి మచ్చుక మాత్రమే.

**వివరాలు ఎవరికీ ఇవ్వకండి**

ఎవరైనా సిమ్‌కార్డుపై ఉన్న 15అంకెల నంబరు అడిగితే ఇవ్వకండి. అనుమానం వస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఇతరులకు మీపేరు మీద సిమ్‌కార్డు తీసి ఇవ్వకూడదు. సిమ్ బ్లాక్ అయిందని వస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి.

- మహేష్, డీఎస్పీ

## క్రీడాకారులకు ఆర్డీటీ ప్రోత్సాహం: మంత్రి

మడకశిర రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థ క్రీడాకారులను ఎంతో ప్రోత్సహిస్తోందని యువజనక్రీడా,రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మడకశిరకు వచ్చిన సందర్భంగా మంత్రి ఆర్ అనంతపురం గ్రామ సమీపంలో ఆర్డీటీ రీజినల్ కార్యాలయం వద్ద రూ.1.63 కోట్లతో నిర్మిస్తున్న ఫుట్‌బాల్ స్టేడియంను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ఆర్డీటీ ప్రోత్సహిస్తోందన్నారు. మైదానం నిర్మిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, కార్యదర్శి శ్రీనివాసుమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి. ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న మంత్రి

# అభివృద్ధి గురించి ఏనాడూ ఆలోచించలేదు

### అందుకే అవిశ్వాసానికి సిద్ధపడ్డాం
### వైసీపీ కౌన్సిలర్లు



కలెక్టర్‌కు అందించిన అవిశ్వాస తీర్మాన పత్రాలను చూపుతున్న కౌన్సిలర్లు

మడకశిరటౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో కౌన్సిలర్లుగా ఎంపికయ్యామని, ఆ పాలకులు ఏనాడూ అభివృద్ధి గురించి ఆలోచించలేదని వైసీపీ కౌన్సిలర్లు బలరాం, రమేష్, సుధాకర్‌నాయక్ అన్నారు. తమను కూడా నమ్మించి వంచించారని వాపోయారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలలో వైసీపీకి చెందిన నాయకులు చైర్మన్ లక్ష్మీనరసమ్మ సైతం తమను పట్టించుకోలేదన్నారు. నగర పంచాయతీ అభివృద్ధికి ఏమాత్రం సహకరించలేదని చేసేది లేక నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరి ఒత్తిడి లేకుండా స్వయంగా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం అందించినట్లు తెలిపారు. కేవలం కొందరు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని తాము ఎలాంటి ప్రలోభాలకు లోను కాలేదన్నారు. కౌన్సిలర్లు నరసింహరాజు, ఉమాశంకర్ తదితరులు మాట్లాడుతూ 13 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి కలెక్టర్‌కు అందించామని ఒకరిద్దరు తమ సంతకాలను ఫోర్జరీ చేశారని సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కలెక్టర్‌కు అందించిన పత్రాలను చూపించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలపై ఓ పత్రిక పని గట్టుకుని బురద జల్లుతున్నట్లు ఆరోపించారు. మే15 తేదీన అవిశ్వాసతీర్మాణానికి తమకు నోటీసులు అందాయని తప్పక మడకశిర నగర పంచాయతీపై తెలుగుదేశం జెండా ఎగరబోతోందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మైనార్టీ జిల్లా అధ్యక్షులు భక్తర్, కౌన్సిలర్లు దాసప్ప, హనుమంతు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



మాట్లాడుతున్న నాగమద్దయ్య

హిందూపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలించేవారిపై ఉక్కుపాదం మోపాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. శనివారం హిందూపురం పరిధిలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూముకుంట చెక్‌పోస్టు, పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరాతీశారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణాదారులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. కేసుల్లో పట్టుబడిన వాహనాలు త్వరితగతిన కోర్టు ద్వారా క్లియరెన్స్ చేయించాలన్నారు. కల్లు దుకాణాల్లో శ్యాంపుల్స్ తీసి చిత్తూరు ల్యాబ్‌కు పంపాలన్నారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్నవారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఎక్కువ కేసులుంటే పీడీయాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈయన వెంట అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐ లక్ష్మీదుర్గయ ఉన్నారు.

## ఉగ్రదాడికి వ్యతిరేకంగా ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

గోరంట్ల, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి వ్యతిరేకంగా గోరంట్లలో హిందూవులు శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కాషాయ కండువాలు ధరించి, త్రివర్ణపతాకాలతో గోరంట్ల పోలీస్ స్టేషన్ వద్దనుంచి ప్రధాన రహదారిపై బస్టాండ్ కూడలి వరకు ప్రదర్శనచేశారు. ఉగ్రవాదం నశించాలి.. భారత్‌మాతాకు జైజై.. జైశ్రీరామ్.. అంటూ నినాదాలుచేశారు. బస్టాండ్ ప్రాంతంలో మానవహారం ఏర్పాటు చేసి, కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ర్యాలీలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు, ముస్లింలు పాల్గొన్నారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**కేసు నమోదు**

గోరంట్ల, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): అత్తింటి ఆరళ్లు భరించలేక భార్య ఆఫ్రిన్ ఫిర్యాదుతో భర్త కుటుంబానికి చెందిన ఆరుగురిపై శనివారం కేసు నమోదుచేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. పుట్టపర్తి మండలం పెడబల్లికి చెందిన ఆఫ్రిన్ గోరంట్లకు చెందిన మహమ్మద్ యాసిన్‌తో 2022లో వివాహంజరిగింది. వారికి కుమారుడు ఉన్నాడు. యాసిన్ అధ్యాపకుడుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొంతకాలంగా భార్య ఆఫ్రిన్‌ను భర్తతోపాటు అత్తమామలు, కుటుంబ సభ్యులు పలువిధాలుగా వేధిస్తున్నారు. ఈ మేరకు ఆఫ్రిన్ ఫిర్యాదుచేయడంతో ఆరుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



## వేసవి ఉపశమనం

**ఎండ** వేడిమిని తాళలేక యువత చల్లటి నీటిలో సేదతీరుతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందడానికి బావులు, చెరువులను ఆశ్రయిస్తూ ఈత కొడుతూ సేద తీరుతున్నారు. మండలంలోని కోనాపురం సమీపంలో పెనుకొండకు వెళ్లే రహదారిలో బావుల్లో జలకాలాడుతూ యువత కేరింతలు కొడుతుండగా ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

- పెనుకొండ రూరల్, (ఆంధ్రజ్యోతి)

## మొక్కజొన్న పంట పరిశీలన



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి విజయభారతి

ఆంధ్రజ్యోతికి స్పందన

పరిగి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో మొక్కజొన్న పంటకు సోకుతున్న ఆకుతెగుళ్లు, కత్తెర పురుగు వ్యాధిని శనివారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో మొక్కజొన్నకు ఆకుతెగుళ్లు కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. మండల వ్యవసాయాధికారి విజయభారతి, సచివాలయ అధికారులు పరిగి, యర్రంటు గ్రామాల్లో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఆకుతెగుళ్లు, కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో సచివాలయ అధికారి లలిత, రైతులు పాల్గొన్నారు.

## ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి




ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యు విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎంఈఓ గంగప్పకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారాలుచేసి అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ యూనిఫాం నోటుపుస్తకాల పేరుతో దోపిడీ చేస్తున్నారన్నారు. అయితే ఫీజులు కార్పొరేట్ స్థాయిలో ఉన్నా సౌకర్యాలు మాత్రం దారుణంగా ఉంటున్నాయన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ గంగప్పను కోరారు. వినతిని అందించినవారిలో హర్షకుమార్, భగత్, లిఖిత్, విక్రం, రోహిత్, పవన్ తదితరులు ఉన్నారు.

## దరఖాస్తు చేసుకోండి

హిందూపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): హిందూపురం తపాలాశాఖ డివిజన్‌లో తపాలా జీవిత బీమా ఏజెంట్లకు దరఖాస్తు చేసుకోవాలని తపాలాశాఖ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 30లోపు హిందూపురం ప్రధాన తపాలా కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. పదోతరగతి చదివి 50ఏళ్లలోపు వయసుండాలని ఆధార్, టీసీ, పాన్‌కార్డు, రెండు ఫోటోలు, సెక్యూరిటీ డిపాజిట్‌కింద రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి పాలసీలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన కమీషన్, ఇన్సెంటివ్ చెల్లించడం జరుగుతుందన్నారు.

## రాత్రివేళల్లో విద్యుత్ కోతలు

ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు

గుడిబండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎస్.రాయాపురం ఫీడర్ రాత్రివేళల్లో వేళాపాళా పాటించకుండా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎస్.రాయాపురం, పూజారిపల్లి, ఎస్ఎస్‌గుండ్లు, మేకలగట్ట, తదితర గ్రామాలు అటవీప్రాంతానికి ఆనుకుని ఉండటంతో చిరుతపులులు, ఎలుగుబంట్లు గ్రామాల్లోకి చొరబడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రాత్రివేళల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయని ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో విద్యుత్ కోతలు ఎందుకు విధిస్తున్నారని విద్యుత్‌శాఖాధికారులను ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ కోతలు విధిస్తే ట్రాన్స్‌కో కార్యాలయం ముందు బైటాయించి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. విద్యుత్‌శాఖ వారు రాత్రిపూట కోత విధించకుండా సరఫరా చేయాలని కోరుతున్నారు.

## ఈకేవైసీ గడువు పెంచాలి

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు




మాట్లాడుతున్న డీఈ మనూనాయక్

అమరాపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ గడువు పెంచాలని ఎంపీటీసీలు తహసీల్దార్ లక్ష్మీనరసింహను కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో కొత్తరేషన్ కార్డులకు, రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈకేవైసీ చేయించుకునేవారు ఇంకా వేలల్లో ఉన్నారని, గడువు పెంచాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడి పదినెలలైనా తల్లికివందనం నగదు విద్యార్థుల ఖాతాలో జమకాలేదని వైసీపీ సభ్యులు ప్రశ్నించారు. మండలంలో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని పాఠశాల ప్రారంభం కాకముందే నియమించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించడం లేదన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రామారావు, ఎంపీపీ ఈరన్న, ఈఓఆర్డీ నాగమణి, డీఈ మనూనాయక్, ఎంఈఓ వెంకటరమణనాయక్, ఏఈ సిద్దేశ్వర, ఇరిగేషన్ ఏఈ భార్గవ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరీష్, ఏఎస్ఐ రామాంజినేయులు, వ్యవసాయాధికారి మంజునాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ పాల్గొన్నారు.

## పరిగిలో వీడియో వివాదం

యువకులకు పోలీసుల కౌన్సెలింగ్

హిందూపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా వీడియో పోస్టు చేసిన ఓ యువతికి పరిగికి చెందిన యువకుడు అసభ్య పదజాలంతో కౌంటర్ ఇచ్చాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక యువకులు కొందరు అసభ్యకర పోస్టు పెట్టిన యువకుడి ఇంటి వద్దకు శుక్రవారం సాయంత్రం వెళ్లారు. అప్పటికే ఆ యువకుడు పరారీ అయ్యాడు. పరిగిలోని ఓ మెకానిక్ షెడ్‌లో పనిచేసే ఆ యువకుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రంగడు అక్కడికి చేరుకుని అందరినీ మందలించి పంపేశారు. కొంతమందిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.



పరిగి పోలీస్ స్టేషన్ వద్ద యువకులు